శ్వేతగిరి.. భక్తజన సిరి

- శాలిహుండం కాళీయమర్ధన వేణుగోపాలున్ని దర్శించుకున్న భక్తజనం
- వంశధార నదిలో స్వామి చక్రతీర్థ స్నానంతో పాటు భక్తుల పవిత్ర స్నానాలు



శాలిహుండం కొండపైకి వెళ్తున్న భక్తులు

గార : శ్వేతగిరి భక్తజన సంద్రాన్ని తలపించింది. మాఘశుద్ధ ఏకాదశి (భీష్మ ఏకాదశి)ని పురస్కరించుకొని కాళీయ మర్ధన వేణుగోపాల స్వామి(శాలిహుండం) యాత్ర శోభాయమానంగా జరిగింది. ఉత్తరాంధ్రతో పాటు ఒడిశా తదితర ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలిరావడంతో శ్వేతగిరి కిటకిటలాడింది. సోమవారం అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో స్వామికి క్షీరాభిషేకం నిర్వహించగా ముందుగా ఆలయ ధర్మకర్త సుగ్గు మధురెడ్డి దంపతులు స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. మంగళవారం ఉదయం రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలుడు, లక్ష్మీనసింహస్వామి ఉత్సవమూర్తులను రెండు పల్లకిల్లో వంశధార నదికి తీసుకువచ్చి భక్తుల సమక్షంలో చక్రతీర్థ స్నానం చేయించారు.

కిటకిటలాడిన పరిసరాలు..

దూర ప్రాంతాల నుంచి ముందురోజు రాత్రికి చేరుకున్న భక్తులు బోరవానిపేట, శాలిహుండం, పూసర్లపాడు గ్రామాల్లో విడిదులు ఏర్పాటు చేసుకొని వ్రతాలు చేశారు. దాసుల పూజలతో పాటు తప్పెటగుళ్లు, దాసుపాటలు భక్తులను అలరించాయి. శ్వేతగిరిపై నున్న పంచక్షేత్రాలూ భక్తులతో కిటకిటలాడాయి. స్వామి దర్శనానంతరం మార్గమధ్యలో వీరవసంతేశ్వరుడు, కొండ దిగువన ఉన్న వేంకటేశ్వరస్వామి, గోవిందరాజస్వామి, నరసింహాస్వామిలను దర్శించుకున్నారు.

60 మంది పోలీసులే అయినా..

లక్షలాది మంది భక్తులు, నదిలో చక్రతీర్థ స్నానం సందర్భంగా ఏటా 300 మంది పోలీసులు యాత్రలో మూడు షిఫ్టుల్లో పనిచేసేవారు. అయితే విశాఖలో మిలాన్ ఉత్సవం సందర్భంగా కేవలం 60 మంది పోలీసులే విధులకు వచ్చారు. డీఎస్పీ వై.శృతి, సీఐ ఎల్.సన్యాసినాయుడు, ఎస్సై కె.కృష్ణప్రసాద్‌లు పోలీసులను సమన్వయం చేస్తూ, కొండ పైకి వాహన నిషేధం పకడ్బందీగా అమలు చేశారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు..

శాలిహుండం జాతరకు వచ్చే భక్తుల కోసం పలు గ్రామాల వద్ద అన్నదానాలు నిర్వహించారు. బోరవానిపేట సత్యసాయి భక్తుల ఆధ్వర్యంలో 7 వేల మందికి అన్నదానం చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ కో ఆర్డినేటర్ నరసింహమూర్తి, జోనల్ కన్వీనర్ పి.నాగేశ్వరరావు, బోర సింహాచలం, నరసింహా రౌలే, సత్యసాయి భక్తులు పాల్గొని సేవలందించారు. పూసర్లపాడు తోట, సతివాడ శివాలయం, శాలిహుండం గ్రామంలో అన్నదానం నిర్వహించారు. కొండపైన పలువురు భక్తులు ఉసిరికాయలు, ట్రస్టీ సుగ్గు మధురెడ్డి మజ్జిగ, వాటర్‌ప్యాకెట్లు వితరణ చేశారు.



చక్రతీర్థ స్నానానికి పల్లకిలో వెళ్తున్న ఉత్సవమూర్తులు



పూజలందుకుంటున్న స్వామివారు



దీపాలు వెలిగిస్తున్న మహిళలు



క్యూలైన్లు పరిశీలిస్తున్న డీఎస్పీ వై.శృతి



బోరవానిపేటలో భక్తులకు అన్నదానం



శాలిహుండంలో భక్తజన సందోహం



ఉత్సవ విగ్రహాలతో అర్చకస్వాములు

క్లుప్తంగా

నేడు వలంటీర్లకు వందనం

శ్రీకాకుళం రూరల్: గార, శ్రీకాకుళం రూరల్ మండలాల పరిధిలోని పనిచేస్తున్న వలంటీర్లకు బుధవారం 'వలెంటీర్లకు వందనం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు శ్రీకాకుళం ఎంపీడీఓ సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు అంపోలు రోడ్డులోని సిస్టం కాలేజీలో జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ స్టాంపుల శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం నేడు

గార : చల్లపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్ పరిశీలన, మరమ్మతుల నేపథ్యంలో స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటలు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ పవన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అంపోలు, కె.సైరిగాం, రామచంద్రాపురం, దీపావళి, బలరాంపురం, వాడాడ పంచాయతీల్లోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మున్సిపల్ టౌన్ ప్లానింగ్ డైరీ ఆవిష్కరణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగం డైరీని కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం కలెక్టర్ మనజీర్ జిలానీ నమూనా ఆవిష్కరించారు. అనంతరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ తమీం అన్సారియా తన కార్యాలయంలో డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు, ఏసీపీ ఎం.వి.రమణమూర్తి, వరహాలనాయుడు, టీపీఓ ఉమమహేశ్వరరావు తదతరులు పాల్గొన్నారు.

సచివాలయ సేవలపై ఆరా

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ)/శ్రీకాకుళం: నగర పరిధిలోని సచివాలయాన్ని కమిషనర్ తమీం అన్సారియా మంగళవారం సందర్శించారు. రికార్డులు పరిశీలించి సేవలపై ఆరా తీశారు. అంకితభావంతో పనిచేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సంకీర్తనలతో దైవసన్నిధి



భక్తులకు హారతినిస్తున్న భక్తి వికాస మహారాజ్ స్వామి

శ్రీకాకుళం కల్చరల్ : శ్రీకృష్ణ కీర్తనలు ఆలపించడమే స్వామి సన్నిధికి చేరుకునేందుకు సులువైన మార్గమని పరమ హంస భక్తి వికాస మహారాజు అన్నారు. పొన్నాడ బ్రిడ్జి వద్ద ఇస్కాన్ మందిరానికి స్వామీజీ మంగళవారం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన భక్తులకు అనుగ్రహ భాషణ చేశారు. ఏవిధంగా జీవిస్తే పరమాత్మున్ని చేరుకుంటామో వివరించారు. అనంతరం 300 మందికి ప్రసాద వితరణ చేశారు. ఇస్కాన్ శ్రీకాకుళం ఇన్‌చార్జి లక్ష్మీపతి గౌరవదాస్, భక్తులు పాల్గొన్నారు.

సంతవురిటిలో వైద్య శిబిరం

జి.సిగడాం: సంతవురిటి గ్రామంలో శ్రీకాకుళం మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ హరిత వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌వలసలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

శ్రీకాకుళం రూరల్: మండలంలోని ఎస్ఎస్‌వలసలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. 473 మందికి రక్తపరీక్షలు, కంటి పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

నిద్దాలమ్మ సన్నిధిలో ఎమ్మెల్యే

జి.సిగడాం: మండలంలోని నిద్దాం గ్రామంలో వెలసిన నిద్దాలమ్మ అమ్మవారిని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ మంగళవారం దర్శించుకున్నారు. ఆయనతోపాటు నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణోత్సవం

గార: భీష్మ ఏకాదశి సందర్భంగా బూరవెల్లిలో ప్రసిద్ధ ఉమారామలింగేశ్వర ఆలయంఓ స్వామి వార్షిక కల్యాణ మహోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. గ్రామ పురోహితులు ఆరవెల్లి సీతారామస్వామి, అనంతరామన్ స్వాముల ఆధ్వర్యంలో మళ్ల జనార్దనరావు, శ్రీదేవి, మణికంఠ, అనూరాధ దంపతులు కల్యాణత్సోవం శాస్త్రోక్తంగా జరిపించారు.

ఆలయాల్లో భీష్మ ఏకాదశి పూజలు

శ్రీకాకుళం కల్చరల్/ఎచ్చెర్ల క్యాంపస్/ఎచ్చెర్ల/జి.సిగడాం: భీష్మ ఏకాదశి సందర్భంగా ప్రముఖ దేవాలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు.

ఘనంగా దత్త ఆశ్రమ వార్షికోత్సవం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని కొత్తబ్రిడ్జి నాగావళి తీరంలో ఉన్న దత్తాశ్రమ 26వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. స్వామివార్లకు 108 కలశాలతో అభిషేకాలు నిర్వహించారు.

ఘనంగా ఆదిత్యుని కల్యాణం



కల్యాణ హారతినిస్తున్న అర్చకులు

అరసవల్లి : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో మంగళవారం భీష్మ ఏకాదశి పూజలు ఘనంగా జరిగాయి. ఆలయ అనివెట్టి మండపంలోఉషా పద్మిని ఛాయా దేవేరులతో శ్రీవారి ఉత్సవమూర్తులను ప్రత్యేక మండపంలో వేంచింపజేసి కల్యాణోత్సవాన్ని ఆగమశాస్త్రం ప్రకారం నిర్వహించారు. ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛారణలు, మంగళధ్వనుల మధ్య కల్యాణం శాస్త్రోక్తంగా జరిపించారు. సేవలో పాల్గొన్న దాతలకు స్వామి వారి శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రూ.2 కోట్లతో శ్రీవారి పుష్కరిణి



పుష్కరిణి నమూనా వద్ద అర్చకులు, అధికారులు

శ్రీకాకుళం కల్చరల్ : పీఎన్ కాలనీలోని నారాయణ తిరుమలలో వేంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద రూ.2 కోట్ల అంచనా వ్యయంతో నూతనంగా శ్రీవారి పుష్కరిణి ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ఆలయ ఈవో శ్యామలరావు, ప్రధాన అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం పుష్కరిణి నిర్మాణ నమూనాను ప్రదర్శించారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ భక్తుల సహకారంతో నిర్మించనున్న పుష్కరిణిలో 12 విగ్రహాలు, శ్రీకృష్ణుని దివ్య విగ్రహం, కళాఖండాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మార్చి 3న శంకుస్థాపన జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ ఈఈ సుగుణాకర్ మాట్లాడుతూ పుష్కరిణి ఏర్పాటుకు భక్తులు తమవంతు సాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో వేంకటరామానుజ సేవాదళం సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన కమ్మసిగడాం జాతర



భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయ ప్రాంగణం



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: ఉత్తరాంధ్ర కల్పవల్లిగా పేరుగాంచిన కమ్మసిగడాం మహాలక్ష్మి జాతర మంగళవారంతో ముగిసింది. మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించిన ఈ జాతరలో భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. జె.ఆర్.పురం సీఐ జి.రామచంద్ర ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అమ్మవారిని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి నడుకుదిటి ఈశ్వరరావు, కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో రణస్థలం జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, వైస్ ఎంపీపీలు రాయపురెడ్డి భుజంగరావు, మైలపల్లి కామరాజు, నాయకులు చిల్ల వెంకటరెడ్డి, పిన్నింటి సత్యంనాయుడు, టీకే బ్రహ్మాజీ, సింక అప్పారావు, సింక సూరి మాస్టారు తదితరులు పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ కూడా అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆర్‌జీయూకేటీ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న క్యాంపస్ అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ విద్యార్థులు విజయనగరం జిల్లా రాజాం జీఎంఆర్ కళాశాలలో ఈ నెల 18, 19 తేదీల్లో నిర్వహించిన టెక్నికల్ ఫెస్ట్‌లో పాల్గొని 'ఎలక్ట్రిక్ మేనేజ్‌మెంట్ సిస్టం' అనే ప్రాజెక్టును ప్రదర్శించారు. సాయిసంతోష్, ప్రేమ్‌చంద్, తరుణ్, కిరణ్ బృందం ప్రదర్శించిన ఈ ప్రాజెక్టు మొదటి స్థానంలో నిలిచి రూ.10 వేలు నగదు బహుమతి గెలుచుకుంది. వీరిని శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కేవీడీజీ బాలాజీ, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ మోహన్‌కృష్ణ మంగళవారం అభినందించారు.


నిర్దిష్ట లక్ష్యంతో చదవాలి

శ్రీకాకుళం అర్బన్/శ్రీకాకుళం/శ్రీకాకుళం(పీఎన్ కాలనీ): విద్యార్థులు నిర్దేశిత లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని శ్రీకాకుళం నగర కమిషనర్ తమీమ్ అన్సారీయా అన్నారు. ఇక్రా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం శ్రీకాకుళం వరం మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, మల్టిపుల్ ఇంటిలిజెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం చిన్నారులకు వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇక్రా ఫౌండేషన్ అధ్యక్షుడు యడ్ల గౌరినాయుడు, భారతీయ మానవ హక్కుల సాధికార సంస్థ నేషనల్ చైర్మన్ భూషణరావు, స్కూల్ హెచ్ఎం ఇందిరామణి, సంఘ సేవకుడు సూర శ్రీనివాసరావు, ఇక్రా ఫౌండేషన్ కమిటీ సభ్యులు ప్రసాద్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు దుస్తులు అందజేస్తున్న కమిషనర్ అన్సారియా

వెలుగునిద్దాం



జి.సిగడాం మండలం నిద్దాం గ్రామంలో మంగళవారం సాయంత్రం దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. నిద్దాలమ్మ యాత్రా మహోత్సవం సందర్భంగా గ్రామస్తులు లక్షా 50 వేల ప్రమిదలు వెలిగించి పూజలు చేశారు. - జి.సిగడాం

ఎచ్చెర్ల నియోజకవర్గ పరిశీలకుడిగా సూరిబాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్, అంధవరపు సూరిబాబు

రణస్థలం: వైఎస్సార్ సీపీ ఎచ్చెర్ల నియోజకవర్గ పరిశీలకుడిగా రాష్ట్ర కళింగ వైశ్య, భేరి వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబును నియమించడం పార్టీ బలోపేతానికి దోహదపడుతుందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. రణస్థలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సూరిబాబు మాట్లాడుతూ ఈ నెల 17న విశాఖపట్నంలో ఉత్తరాంధ్ర రీజనల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి నిర్వహించిన కోర్డినేటర్ల సమావేశంలో తనను ఎచ్చెర్లకు కేటాయించారని తెలిపారు. గతంలో ఓసారి ఎచ్చెర్లలో పనిచేసి తర్వాత నెల్లిమర్ల నియోజకవర్గ పరిశీలకుడిగా సేవలందించానని పేర్కొన్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో అందరితో సమన్వయంగా పనిచేసి రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా కృషి చేస్తానని చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందిస్తున్న పథకాలు, సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థల సక్రమమైన పనితీరే జగనన్న గెలుపునకు దోహదపడతాయని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మురళీధరబాబా, దోల వెంకటరమణ, చిల్ల వెంకటరెడ్డి, రణస్థలం మండల పార్టీ అధ్యక్షులు గురాన మానస తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్నలో తెగుళ్లపై అప్రమత్తం

రణస్థలం: మొక్కజొన్న పంటలో ఆకు ఎండు తెగులు ముందుగానే గుర్తించి నివారణ మందులు పిచికారీ చేయాలని జిల్లా వనరుల కేంద్రం ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ అనూషా సూచించారు. రణస్థలం పంచాయతీలోని చినలంకపేటలో మొక్కజొన్న పంటలో ఆకు ఎండు తెగులును మంగళవారం గుర్తించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెగులు ఆశించిడానికి ముందుగా లీటర్ నీటికి మూడు గ్రాముల మ్యాన్‌కోజెబ్/సాఫ్ వినియోగించాలని, తెగులు ఆశిస్తే లీటరు నీటిలో రెండు మిల్లీ లీటర్ల ప్రొఫికొనజోలేను కలిపి పిచికారి చేయాలని చెప్పారు. మిరపలో నల్ల తామర పురుగుల నివారణకు ఫినోల్/జిమిడక్లోపిరిడ్ మందును నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌సీ ఏవో వి.సూర్యకుమారి, రణస్థలం ఏవో డి.విజయభాస్కర్ పాల్గొన్నారు.

మార్చి 9న లోక్ అదాలత్

శ్రీకాకుళం పాతబస్టాండ్: మోటారు వాహన ప్రమాద బాధితులకు సత్వర న్యాయం అందజేసేందుకు లోక్ అదాలత్ దోహదపడుతుందని జిల్లా జడ్జి జులైన్ అహ్మద్ మౌలానా అన్నారు. రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు మార్చి 9న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించి మంగళవారం సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్, జడ్జి జ్ఞాన సువర్ణ రాజు, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

గోడిశామ్యూల్ మృతికి సంతాపం



శ్రీకాకుళం కల్చరల్ : ప్రముఖ ఆధ్యాత్మికవేత్త (ఇవాంజలిస్టు) రెవరెండ్ డాక్టర్ గోడి శామ్యూల్(88) కన్నుమూశారు. నగరంలోని డగ్లస్ విద్యాసంస్థల ప్రాంతంలో నివాసముంటున్న ఆయన కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈయనకు భార్య విజయరత్నం, చిన్న కుమారుడు జోసెఫ్ డేనియల్ గోడి, కుమార్తెలు ఇవేన్ గ్లోరీ, గ్రేస్ విక్టోరియా ఉన్నారు. పెద్దకుమారుడు జాన్ ఎస్ గోడి కొన్నేళ్ల క్రితమే మరణించారు. 1960లో శ్రీకాకుళం జిల్లా క్రైస్త దైవజనుడిగా వచ్చిన శామ్యూల్ పెంతుకోస్తు సంఘాల బలోపేతానికి కృషి చేశారు. అనాథలను చేరదీసి ఆశ్రమాన్ని నిర్వహించారు. లెప్రసీ కాలనీని దత్తత తీసుకొని నివాసయోగ్యమైన ఇళ్లను నిర్మించడంలో కీలక పాత్ర పోషించారు. గోడి శామ్యూల్ మృతి పట్ల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు రెవరెండ్ జాన్ జీవన్, రెవరెండ్ కృపానందం, పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు బీఎస్‌పీఎస్ కుమార్, వివిధ సంఘాల ప్రతినిధులు సంతాపం తెలిపారు.

